GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 20-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# దేశంలోనే కోదాడ జాబ్ మేళా అతి పెద్ద జాబ్ మేళా

- తెలంగాణలో రైతులు భూములు అమ్ముకొని పిల్లల్ని చదివించారు....
- మట్టిలో మాణిక్యాల కు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికే ఎంతో కష్టపడి జాబ్ మేళా నిర్వహించాం..
- దేశంలోనే పేరుగాంచిన 350 కంపెనీలు జాబ్ మేళ లో వచ్చాయి.
- 30 వేల పైచిలుకు నిరుద్యోగులు జాబ్ మేళాకు తరలివచ్చారు...
- తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే వచ్చి తీరుతుంది.
- కోదాడ హుజూర్నగర్ నియోజక వర్గాల ప్రజలే మా కుటుంబ సభ్యులు... జాబ్ మేళాలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.





**కోదాడ సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్)**

కోదాడలో నిర్వహించిన జాబ్ మేళా దేశంలోనే అతిపెద్ద జాబ్ మేళాగా నిలిచిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణలో రైతులు తమ భూములను అమ్ముకుని తమ పిల్లలను చదివించారని, వారి కష్టానికి తగిన ఫలితం దక్కేలా మట్టిలో మాణిక్యాలుగా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడి ఈ జాబ్ మేళాను నిర్వహించామని తెలిపారు. కోదాడ పట్టణంలో శనివారం ఎమ్మెల్యే, జాబ్ మేళా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పద్మావతి రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాసన మండలి స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, అనిల్ కుమార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే పేరుగాంచిన 350 కంపెనీలు జాబ్ మేళాకు తరలివచ్చాయని, 30 వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరై ఉద్యోగాల కోసం తమ అర్హతలను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాల

మిగతా 2లో

# ఆకుతోటపల్లిలో అక్రమ మైనింగ్ అనుమతుల రద్దుకు భారీ ఆందోళన

- ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపించి లీజుకు ఇచ్చారంటూ గ్రామస్తుల ఆరోపణ
- ప్రజాభిప్రాయం, గ్రామ పంచాయతీ ఎన్ఓసీ లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నలు
- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రైతులు, మహిళలు, యువత భారీ ధర్నా

7లో




# దంచికొట్టిన వాన



నగరంలో వర్షం శనివారం భారీగా కురిసింది. హయత్‌నగర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, మణికొండ, ఉప్పల్, రామాంతాపూర్, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, నాంపల్లి ప్రాంతాల్లో వర్షం కారణంగా రోడ్లు జలమయమయ్యాయి. ఒక్కసారిగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని రోజులుగా విభిన్న వాతావరణ పరిస్థితులతో నగరం ఉక్కపోతమయంగా మారడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసింది.ప్రపంచ పటాలు పరిశీలించండి ఈ పరిస్థితుల్లో వర్షం కురవడంతో నగరవాసులు ఊపిరిపీల్చుకున్నారు. అత్యధిక వర్షపాతం హయత్‌నగర్‌లో 6.3 సెం.మీటర్లుగా నమోదైంది. బాలాపూర్‌లో 5.9సెం.మీ, రాజేంద్రనగర్‌లో 4.4సెం.మీ., మైలార్‌దేవుపల్లిలో 4 సెం.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

# దేశంలోనే కోదాడ జాబ్ మేళా అతి పెద్ద జాబ్ మేళా



ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలే తమ కుటుంబ సభ్యులని పేర్కొన్నారు. గత 34 ఏళ్ళు గా 6సార్లు ఎమ్మెల్యే గా, రెండు సార్లు మంత్రి గా,2 సార్లు ఎంపీగా ప్రజా సేవా లో ప్రజల ఆదరాభిమానాలు పొందు తున్నఅన్నారు. ప్రస్తుతం జాబ్ మేళా లో కొందరికి ఆర్డర్లు ఇస్తున్నామని, మరి కొంత మందికి కంపెనీ లు తమ సంస్థల్లో పూర్తి స్థాయిలో ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగాలు ఇస్తాయనీ, ఎవరికి ఏ సమస్య ఉన్న తన కార్యాలయం లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త అధ్యాయానికి కోదాడ జాబ్ మేళా నాంది..

**ప్రజా ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలు కల్పించింది: గడ్డం ప్రసాద్...**


కోదాడలో నిర్వహించిన మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. యువతకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 60 వేల ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలోనూ విస్తృత అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కోదాడలో కనీవినీ ఎరుగని రీతిలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారీ సంఖ్యలో కంపెనీలు, ఉద్యోగ అవకాశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా యువతకు నేరుగా ఉద్యోగావకాశాలు పొందే అవకాశం కల్పించారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన విద్య, ఉపాధి హక్కులను సమర్థవంతంగా అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలను మెరుగుపరుచుకుని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోదాడ హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి నిరంతర కృషీవలురు ఉత్తమ్ పద్మావతి దంపతులు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని తపన ఆ దంపతుల్లో ఉంది.

**ఉమ్మడి నల్గొండ జిల్లాలో రూ.10 వేల కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్, రోడ్ల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కృషి... శాసన మండలి చైర్మన్ స్పీకర్ గుత్తా**

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దంపతులు నిరంతరం కృషి చేస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే తపన ఉత్తమ్,పద్మావతి దంపతుల్లో ఉందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కోదాడలో భారీ స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాగునీటి రంగంతో పాటు రహదారుల అభివృద్ధికి సుమారు రూ.10 వేల కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా రైతుల పంటలను కాపాడేందుకు సాగునీటి వనరుల అభివృద్ధిపై మంత్రి నిరంతరం దృష్టి సారిస్తున్నారని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం 24 గంటలు శ్రమించే వ్యక్తిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా గత మూడేళ్లుగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రైతులకు పంటకు గిట్టుబాటు ధర, ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల సమగ్ర అభివృద్ధే తమ అందరి లక్ష్యమని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం, సాగునీటి సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు మార్కెట్ కమిటీ చైర్మన్ కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి , టీ పీపీసీ కార్యదర్శి సి.హెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్, ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి , సూర్యాపేట డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న నల్లగొండ డిసిసి అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కైలాష్, టూరిజం మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కోదాడ జాబ్ మేళాలో వివిధ విభాగాల్లో బాధ్యతలు తీసుకున్న నాయకులు కేఎల్ఎం ప్రసాద్ బషీర్, ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, కోదాడ మున్సిపల్ కౌన్సిలర్లు, ఫ్లోర్ లీడర్ , కందుల కోటేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీఓ సూర్య నారాయణ, రెవిన్యూ, పోలీస్, హెల్త్, పంచాయతీ రాజ్ సిబ్బంది, సర్పంచ్ లు వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల శాఖ ల, మహిళా సంఘాల నాయకులు ఉన్నారు.







## ఒకేరోజు ఏడుగురు దుర్మరణం

**శంషాబాద్‌లో నలుగురు.. శామీర్‌పేటలో ముగ్గురు**

నగర రోడ్లు నెత్తురోడాయి. వేర్వేరు ప్రమాదాల్లో ఒకే రోజు ఏడుగురు చనిపోయారు. శంషాబాద్ సీఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం..శంషాబాద్ పట్టణంలోని మధురనగర్ కాలనీలో నివాసముంటున్న కేతావత్ లింబ్యానాయక్(54) భార్య జమున(45) తమ్ముళ్లు కేతావత్ మాన్‌సింగ్(48), కేతావత్ వస్తాన్(45)కలిసి వినాయక చవితి పండుగకు స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం, మెట్టుగూడ తండాకు కారులో వెళ్లారు. శనివారం తిరిగి వస్తుండగా హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి, శంషాబాద్ మండలం పాలమాకుల సమీపంలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన కల్వర్టును కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులతో పాటు డ్రైవర్ సభావత్ అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుకొని పరిశీలించగా కేతావత్ లింబ్యానాయక్, జమున, కేతావత్ మాన్‌సింగ్, వస్తాన్ మృతి చెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. తీవ్ర గాయాలకు గురైన డ్రైవర్ సభావత్ అశోక్‌ను చికిత్స కోసం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు.

నాచారం ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్ హుస్సెన్(26), కూలీలు ఇబ్రహీం, రింకు, అశోక్, భీమ్‌షాలతో కలిసి వాహనంలో శుక్రవారం రాత్రి చేగుంట నుంచి కీసర వైపు వస్తున్నారు. శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు పై వీరు ప్రయాణిస్తున్న వాహనం టైర్ పంచర్ అయ్యింది. దీంతో ఇస్మాయిల్ హుస్సేన్, రింకు, ఇబ్రహీంలతో కలిసి తమ టైర్‌ను మారుస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన మరో వాహనం ఇస్మాయిల్ హుస్సేన్, రింకు, ఇబ్రహీంలను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. అశోక్, భీమ్ షాలు రాళ్లు తేవడానికి వెళ్లడంతో ప్రమాదం బారి నుంచి బయటపడ్డారు. అతివేగంతో నిర్లక్ష్యంగా వచ్చి ఢీకొట్టిన వాహనం డ్రైవర్ నాగరాజును వారు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే నాగరాజు అక్కడి నుంచి పరారీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# మహిళలు జిజియ బాయి స్ఫూర్తితో.. యువత శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగిన నాడే సనాతన ధర్మం





**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** ప్రతి మహిళ జిజి య బాయి స్ఫూర్తితో, ప్రతి యువకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ముందుకు సాగినప్పుడే సనాతన ధర్మం, హిందూ సంస్కృతి మరింత వెలుగొందుతాయని భాజపా ఎండోమెంట్స్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, చెందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తులు, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి అనంతగిరి జిల్లా వికారాబాద్‌లోని శివాజీనగర్ బాలభక్త సమాజం కట్ట మైసమ్మ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవరాత్రి గణేష్ మండపం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా, ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్. నరేష్ కుమార్ మాట్లాడుతూ.. తొలి పూజలందుకునే విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ కాలం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అనంతరం లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను ప్రజలను ఒక వేదికపైకి తీసుకువచ్చే కార్యక్రమంగా మలిచి, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. ప్రతి మహిళ రుద్రమదేవి, జిజాబాయి వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, యువత సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి దేశభక్తుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వికారాబాద్ మాజీ బీజేపీ అధ్యక్షులు, సేంద్రియ వ్యవసాయ బోధకులు, భగవద్గీత పారాయణ నిర్వాహకులు సదానంద రెడ్డి, ఆయన సతీమణి శ్రీదేవి మాట్లాడుతూ.. పురాతన సనాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ, చందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడిగా ఆలయ నిర్మాణ కార్యక్రమాల్లో సేవలందిస్తున్న ఆర్. నరేష్ కుమార్ చేస్తున్న సనాతన ధార్మిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవలు మారుమూల గ్రామాలకు విస్తరించినప్పుడే ప్రజల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యం మరింత పెరుగుతుందని అన్నారు. అనంతరం ఆర్. నరేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించి గౌరవించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మూసీ నది వంతెన వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లి మూసీ నది వంతెన వద్ద మున్సిపల్ అధికారులు చేపట్టిన ఏర్పాట్లను శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, కమిషనర్ ఏ. యోగేష్ శనివారం పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, పారిశుధ్యం, తాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సాయి కాలనీలో యువ గణేష్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గణనాథుడి పూజలు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :**మున్సిపాలిటీ పరిధిలోని సాయి నగర్ కాలనీలో యువ గణేష్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ కాలనీవాసులు భక్తిప్రపత్తులతో పాల్గొంటున్నారు. గణేష్ నవరాత్రుల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలకు కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటూ గణనాథుడి ఆశీస్సులు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సూర్యనారాయణ, పరమేశ్వర్, రాజేశ్వర్ గౌడ్, రఘునందన్ రెడ్డి, బిక్షపతి, తమ్మి శంకర్, జంగారెడ్డి, బాల్ పంతులు, ప్రమోద్, సంజీవ్, కరీం పాషా, జగన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులతో పాటు మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.



# ఆమనగల్లు అభివృద్ధికి రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరాభివృద్ధి నిధుల నుంచి మంజూరైన మొత్తం రూ.2 కోట్లతో వివిధ వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం శ్రీకాంత్ కాలనీలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆమనగల్లు పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు కాలనీల్లో మౌలిక వసతులను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ పనులను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 8వ వార్డులోని సంకటోనిపల్లి బీసీ కాలనీలో రూ.40 లక్షలు, 9వ వార్డు శ్రీకాంత్ కాలనీలో రూ.40 లక్షలు, 11వ వార్డు పద్మశాలి నగర్‌లో రూ.30 లక్షలు, 12వ వార్డులో రూ.40 లక్షలు, 10వ వార్డులోని విట్టాయిపల్లి, పెంట తండా ప్రాంతాల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ తదితర సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. మంజూరైన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పురపాలక సంఘం చైర్‌పర్సన్ నేనావత్ పత్య నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాటా గీతా నర్సింహ, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, యనమల రమేష్, కోగూర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, నాగిళ్ల జగన్, మొక్తలా వెంకటయ్య, పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు, ఆప్షన్ సభ్యులు చుక్క అల్లాజీగౌడ్, అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ ఏఈ నరేష్, కార్యాలయ సిబ్బంది, రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






# రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు అందించాలి

- పామాయిల్ సాగుపై విస్తృత అవగాహన కల్పించాలి..
- సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(ఆమనగల్లు) :** రైతుల వ్యవసాయానికి 24 గంటల పాటు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా కోరారు. శనివారం ఆమనగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంప వెంకటేష్ గుప్తా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. గతంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరిగేదని, ప్రస్తుతం విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ సాగు చేస్తున్న రైతులతో పాటు పాడి రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో విద్యుత్ కోతలు లేకుండా పాడి రైతులకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

**పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి...**

మండలంలోని రైతులను పామాయిల్ సాగు వైపు ప్రోత్సహించేందుకు గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని గంప వెంకటేష్ గుప్తా సూచించారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలపై రైతులకు పూర్తి వివరాలు తెలియజేసి సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి....**

పోలేపల్లి, సింగంపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల సర్పంచులు సత్యం, వెంకటయ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్టీసీ మేనేజర్ స్పందిస్తూ గ్రామపంచాయతీ తరఫున వినతిపత్రం అందజేస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**చింతలపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలి....**

చింతలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ యాదయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

**అనధికార పశువైద్యంపై చర్యలు తీసుకోవాలి....**

పశువైద్య అధికారులు, సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు ఆయా సర్పంచులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని పలువురు సర్పంచులు కోరారు. అదే సమయంలో అర్హత లేని వ్యక్తులు గ్రామాల్లో పశువులకు వైద్యం చేస్తున్నారని, అలాంటి వారిని నియంత్రించేందుకు పశువైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని గంప వెంకటేష్ గుప్తా సూచించారు.

**మృతుల పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించాలి....**




మండలంలోని కొన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సర్పంచులు ఆరోపించారు. మృతి చెందిన వ్యక్తుల పేర్లపై కూడా రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోందని, మృతుల పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని తెలిపారు. దీనిపై గంప వెంకటేష్ గుప్తా స్పందిస్తూ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, మృతుల పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తకుంట తండాలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని సర్పంచ్ పత్య నాయక్ సభ దృష్టికి తీసుకువచ్చారు.

**విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల్లో డబ్బులు వసూలు చేయొద్దు....**

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం రిపేర్ సెంటర్లకు తీసుకువచ్చిన రైతుల నుంచి ఉచితంగా సర్వీస్ చేయకుండా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలను గంప వెంకటేష్ గుప్తా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతుల నుంచి ఎలాంటి అదనపు డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**గ్రామాల్లో విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ....**

ఆమనగల్లు మండలంలోని 13 గ్రామపంచాయతీలలో విలేజ్ పోలీసింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు ఆమనగల్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా వారి దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలు ఉపయోగించకుండా భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్ శాఖ సహకారం అందిస్తుందని తెలిపారు.

**చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి....**

మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో సూచించారు. మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ల విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన జరుగుతోందని సభకు వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి శోభారాణి, ఎంపీడీవో జయరామ్ విజయ్, మిషన్ భగీరథ డీఈ మోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీటీ వినోద్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వినాయక యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ముత్యాలమ్మ గూడెంలో వినాయక యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా పాలకూరి శ్రీధర్ గౌడ్, శ్రీవాణి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూత్ సభ్యులు భక్తితో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. అన్నదానం మించిన దానం లేదని, ఇలాంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరుపుల పరమేష్, అజీమ్, ఇబ్రహీం, బెల్లీ సత్తయ్య, రెముడాల లింగస్వామి, పాల శివ, జావిద్, కమిటీ సభ్యులు జగిని బిక్షం రెడ్డి, యాదయ్య, నరసింహ, భాను, శేఖర్, శ్రీకాంత్, ప్రశాంత్, వరుణ్, శివ, గణేష్, సాయి కుమార్, ధ్రువ, వినయ్, చందు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ మూడవ వార్డులో శివాజీ గణేష్ మండపం వద్ద ఘనంగా అన్న సమర్పణ



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో గణేష్ నవరాత్రుల సందర్భంగా శివాజీ గణేష్ మండపం వద్ద భక్తులకు ఘనంగా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ అన్న సమర్పణ కార్యక్రమానికి సహకారం అందించిన చేవెళ్ల జైరామ్ రెడ్డి, సురేష్, సంతోష్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, రాజ్యలక్ష్మి చిన్నలను భక్తులు అభినందించారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాలనీవాసులు ఎంతో కష్టపడి సహకరించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్, బీజేపీ నాయకులు నరసింహారెడ్డి, కుమార్, గోవింద్ గౌడ్, సుధాకర్ గౌడ్, నాని, నయన్, బాబీ, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీవాసులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# విద్యార్థినిలు పీఎం విద్యాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మేనేజర్ కొనుగంటి ప్రవీణ్ కుమార్

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా:** ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వేదికగా కెనరా బ్యాంక్ (మమత రోడ్ బ్రాంచ్) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం "పీఎం విద్యాలక్ష్మి" పై దేశవ్యాప్త విద్యా రుణ అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థినులు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో కెనరా బ్యాంక్ మమత రోడ్ బ్రాంచ్ మేనేజర్ కొనుగంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థినులు దేశంలోని ప్రముఖ ఉన్నత విద్యాసంస్థల్లో (ఒఎజు×ం) సీట్లు సాధిస్తే, ఎలాంటి గ్యారెంటీ (పూచీకత్తు) లేదా తాకట్టు లేకుండా పీఎం విద్యాలక్ష్మి పథకం కింద విద్యా రుణాలు పొందవచ్చని వివరించారు. ఈ రుణాల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని, అర్హతలను మరియు వడ్డీ రాయితీ ప్రయోజనాలను విద్యార్థినులకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బానోత్ రెడ్డి, అధ్యాపక బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. మహిళా సాధికారతకు, విద్యార్థినుల ఉన్నత చదువులకు కెనరా బ్యాంక్ అందిస్తున్న ఈ సహకారాన్ని మరియు అవగాహన సదస్సును కళాశాల యాజమాన్యం అభినందించింది. ఫీల్డ్ ఆఫీసర్ శ్రీమతి రోజా తదితరులు పాల్గొన్నారు.





## అడ్డా కార్మికులకు వసతులు కల్పించాలి

**పెద్దపల్లి ఎంపీకి హెచ్ఎంఎస్ వినతి**

**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల పట్టణంలో రోడ్ల పక్కన ఉపాధి కోసం ఎదురుచూస్తున్న అడ్డా కార్మికులకు శాశ్వత స్థలం కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలని హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీకి హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి, ముక్రం చౌరస్తా తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ వందలాది మంది భవన నిర్మాణ, దినసరి కూలీలు పనుల కోసం రోడ్ల పక్కనే వేచి చూడాల్సి వస్తోందన్నారు. సరైన స్థలం లేక ఎండ, వర్షం, ట్రాఫిక్‌తో తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇది వారి భద్రతకే కాకుండా వాహనదారుల రాకపోకలకూ ఇబ్బందిగా మారిందన్నారు.ప్రభుత్వం స్పందించి అడ్డా కార్మికులకు శాశ్వత స్థలంతో పాటు షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, బెంచీల వంటి వసతులు కల్పించాలని కోరారు. కార్మికులను ఈ-శ్రమ, సంక్షేమ బోర్డుల్లో నమోదు చేసేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేలా ఎంపీ చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ప్రతినిధులు ఎండీ షఫీ, ఎండీ హుస్సేన్, తగురం శ్రీనివాస్, పల్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనాలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**దౌల్తాబాద్, బోర్పట్లలో చెరువులను పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్**

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్19:** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినాయక శోభాయాత్రలు, నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. శనివారం హత్నూర మండలంలోని దౌల్తాబాద్, బోరపట్ల గ్రామాల్లో నిమజ్జనాలు నిర్వహించనున్న చెరువులను ఆయన పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అవసరమైన లైటింగ్, క్రేన్లు, ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రోడ్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. చెరువుల వద్ద బారికేడింగ్, భద్రతా లైటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో హత్నూర తహసీల్దార్ షేక్ పర్వీన్, జిన్నారం ఇన్స్పెక్టర్ రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ఆశ్రమ చిన్నారుల మధ్య 64 కిలోల కేక్ కట్ చేసి అన్నదానం**



**అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 19:** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 64వ జన్మదిన వేడుకలను అమీన్‌పూర్ డివిజన్‌లోని మహిమా మినిస్ట్రీస్ అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కృష్ణ, ప్రమోద్ రెడ్డి, గోపాల్, యువ నాయకులు తుమ్మల రుష్యంత్ రెడ్డి, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పూరీ జగన్నాథుడి దర్శనానికి వెళ్లడంతో ఆయన ఆశీస్సులతో ఆశ్రమ చిన్నారుల సమక్షంలో 64 కిలోల కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజాసేవకు అంకితమైన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జన్మదినాన్ని అనాథాశ్రమ చిన్నారుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల భవనాలు, ఆలయాలు, మసీదుల అభివృద్ధికి ఆయన సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. యువ నాయకులు రుష్యంత్ రెడ్డి, సంతోష్ రెడ్డి, సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవేందర్, యాదగిరి, రవీందర్, జ్ఞానేశ్వర్, కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానానికి ముందుకు రావాలి

**డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పిలుపు**

**జిల్లా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ..**
**అక్టోబర్ 1న జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు**



**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్):** రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రజలు, యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాల్లో భాగంగా శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నిర్వహించిన రక్తదాన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లావ్యాప్తంగా రక్తదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1న జిల్లాలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ప్రసవ సమయంలో గర్భిణులు, బాలింతలతోపాటు సికిల్ సెల్, తలసేమియా బాధితులు, అత్యవసర చికిత్స పొందుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించవచ్చన్నారు. రక్తదానం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని, దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి విస్తృత అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. రక్తదానంపై అవగాహన పెంచడంతోపాటు స్వచ్ఛంద దాతలను ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారులు రమ్య, అమన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, రషీద్, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, పుట్ట సత్తయ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధి మహేందర్, తలసేమియా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఐసీటీసీ, దిశా సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

# జన్వాడకు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలకు పోలీసుల అడ్డంకి

**జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు గేట్లు వేసి కీలక నేతల దిగ్బంధం**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 19:** జన్వాడ ఫామ్‌హౌస్ అంశంపై నిరసన తెలిపేందుకు బయలుదేరిన పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ జన్వాడకు వెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు జన్వాడ వైపు బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారని నేతలు తెలిపారు. కన్వెన్షన్ సెంటర్ ప్రధాన గేటుకు తాళం వేసి పలువురు కీలక నాయకులను బయటకు వెళ్లకుండా నిర్బంధించారని పేర్కొన్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతియుతంగా నిరసన కార్యక్రమానికి వెళ్తున్న తమను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును ఖండిస్తూ నిరసన తెలిపారు. కేటీఆర్‌పై రాజకీయ కక్షసాధింపు చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.



## వినాయకుడి పూజలో పాల్గొన్న జంగం శేఖర్ దంపతులు


**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శుభ శుక్రవారం వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో తిరంగా యూత్ ఆధ్వర్యంలో వినాయకుడికి ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జంగం శేఖర్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగం శేఖర్ మాట్లాడుతూ, వినాయక నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. యువత ఐక్యతతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరంగా యూత్ సభ్యులు, వెంకటేశ్వర కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొని వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో అన్నదానం గొప్ప:

**తాసిల్దార్ దాసరి రాజ మల్లయ్య,**

**ఎస్ఐ కే రాజు**

**క్రైమ్ మిర్రర్,రామడుగు:-** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రామడుగు గ్రామంలో మాల సంఘం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నిహ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ అన్నదానానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై కే రాజు, తాసిల్దార్ దాసరి రాజ మల్లయ్య, మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపతో ఏటా ఈ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం పూజలు, భజనలకే పరిమితం కాకుండా, 'అన్నదానం మహాదానం' అనే సంకల్పంతో ప్రతి ఒక్కరికీ స్వామివారి ప్రసాదాన్ని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. , ఉత్సవ కమిటీ సభ్యులు.స్వచ్ఛంద సేవకులు పూర్తి సహకారాన్ని అందించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నదాన వేదిక వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు స్వయంగా వడ్డించి, క్రమశిక్షణతో ప్రసాద వితరణ సాగేలా పర్యవేక్షించారు. అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు భక్తులకు, సహకరించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మొయిజ్, 14వ వార్డ్ మెంబర్ సిరికొండ పల్లవి సాయి, ఉత్సవ కమిటీ మెంబర్స్, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# హౌసింగ్ ఏఈ వివేక్‌ను సస్పెండ్ చేయాలి

- అధికారిక వాట్సాప్ గ్రూపులో రాజకీయ పోస్టుపై మండల టీఆర్ఎస్ పార్టీ నిరసన
- రోడ్డుపై బైఠాయింపు --- విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ హామీ

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** రాజాపేట మండల హౌసింగ్ ఏఈ వివేక్ అధికారిక వాట్సాప్ గ్రూపులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావుకి వ్యతిరేకంగా రాజకీయ పోస్టు పెట్టారని ఆరోపిస్తూ మండల టీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారి అధికారిక కమ్యూనికేషన్ గ్రూపులో రాజకీయపరమైన పోస్టులు చేయడం సరైన విధానం కాదని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా మండల టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాజాపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు అక్కడికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఈ వివేక్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి, వాస్తవాలు నిర్ధారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు హామీ ఇచ్చారు. అనంతరం మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక ఎంపీడీవోకి ఏఈ వివేక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అధికారిక వాట్సాప్ గ్రూపులో రాజకీయ పోస్టు చేసిన అంశంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, బాధ్యత వహించిన అధికారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వ అధికారులు రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని, అధికారిక కమ్యూనికేషన్




వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ టిఆర్ఎస్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్ గౌడ్ మాజీ సర్పంచుల రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి గోపగాని యాదగిరి గౌడ్ టౌన్ ప్రెసిడెంట్ బిడిద వీరేశం కుర్రారం సర్పంచ్ బొడ్డు భాస్కర్ మల్ల గూడెం సర్పంచ్ బాలరాజు రెడ్డి బేగంపేట సర్పంచ్ మంత్రాల అనూష సుమన్ మాజీ సర్పంచులు బొంగోని ఉప్పలయ్య రామిండ్ల నరేందర్ గుంటి కృష్ణ చెరుకు కనకయ్య ముల్లగూడెం రాజు మడోతు లక్ష్మణ్ నాయక్ భోగ హరినాథ్ నాగరాజు కొండం రాజు కుందనపల్లి నరసింహులు సీస శ్రీనివాస్ యువజన నాయకులు తుంగ అక్షయ్ వరిమడ్ల బాలకృష్ణ మోత్కుపల్లి బాలకృష్ణ వలభోజు అఖిల్ మార్క శివ పిట్టల వెంకటేష్ మిరియాల ప్రశాంత్ కలకుంట్ల ప్రశాంత్ తుంగ వేణు గొర్రెంకల సాయి అనిల్ సతీష్ బబ్బురి కార్తీక్ బత్తిని వేణు మిర్యాల మహేష్ ఉచ్చేంతల సమ్మీ తమ్మలి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జరుగుతున్న అభివృద్ధిని ఓర్చుకోలేకే అసత్య ప్రచారాలు

**వసూళ్ల కోసం కాంట్రాక్టర్లకు బెదిరింపులు**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్పేట్ సర్కిల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూచి ఓర్చుకోలేకపోతున్నారని, జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి కాంట్రాక్టర్లను బెదిరిస్తూ వసూళ్లకు బిఆర్ఎస్ నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరులు సమావేశంలో జిహెచ్ఎంసి 58వ డివిజన్ అధ్యక్షుడు ఏడుదొడ్ల సురేందర్ రెడ్డి, మీర్ పేట్ డివిజన్ అధ్యక్షుడు చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ డివిజన్ అధ్యక్షులు సిద్దాల శ్రీశైలం, నాదర్గుల్ డివిజన్ అధ్యక్షుడు బోయినపల్లి గోవర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ పైలా శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పరుశరామ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక, వర్షం వస్తే ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు పడిన కష్టాలు గత పాలకులకు కనిపించలేదని ప్రశ్నిస్తూ, గ్రామపంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా, కార్పొరేషన్లుగా మారినా గత పాలకులు నిధులను కేవలం కాగితాలకే పరిమితం చేశారని, ?రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే, స్థానిక ప్రజా అవసరాలను గుర్తించి చొరవ తీసుకున్నారని, అందులో భాగంగానే మీర్‌పేట్ కార్పొరేషన్‌కు 30 కోట్లు, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు 15 కోట్లు మంజూరు చేయించారన్నారు. అయితే, ఈ కార్పొరేషన్లు ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనం కావడంతో సాంకేతిక కారణాల వల్ల ఆ నిధులను నేరుగా ఖర్చు చేసేందుకు వీలుపడలేదు. దీంతో ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో చల్లా నరసింహారెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆ వర్క్ లను జీహెచ్ఎంసీకి బదిలీ చేయించి, నూతన అంచనాలు రూపకల్పన చేసి పనులను వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టారని స్పష్టం చేశారు. ప్రజాహితం కోసం పనులు వేగవంతం అవుతుంటే, జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఓ బీఆర్ఎస్ నాయకుడు ఉద్దేశపూర్వకంగా చల్లా నరసింహారెడ్డిపై బురదజల్లే కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సదరు బీఆర్ఎస్ నాయకుడు కాంట్రాక్టర్లను బెదిరిస్తూ వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నారని, కమిషన్ల కోసం కక్కుర్తి పడుతూ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ?సదరు బీ.ఆర్.ఎస్ నాయకుడికి దమ్ముంటే, దేవుడి సాక్షిగా ప్రమాణం చేసి తాను నిర్దోషినని నిరూపించుకోవాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ?ప్రజల సంక్షేమం కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం అహర్నిశలు పాటుపడుతున్న నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తూ, అభివృద్ధి పనులను ఆపేందుకు కుట్రలు పన్నుతున్న ఇటువంటి నాయకుల పట్ల కాలనీవాసులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారిని ఎక్కడికక్కడ నిలదీయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.



## శిల్పారామంలో పూంపుహార్ మెగా హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో ప్రారంభం.

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** శిల్పారామంలో పూంపుహార్ పేరిట మెగా హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో శనివారం ఘనంగా ప్రారంభమైంది. తమిళనాడు ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి పి.మూర్తి రాజా ఎక్స్‌పోను ప్రారంభించారు. తమిళనాడు హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19 నుంచి 23 వరకు ఈ ఎక్స్‌పో జరగనుంది. తమిళనాడులోని వివిధ జిల్లాల కళాకారులు తయారుచేసిన కాంస్య విగ్రహాలు, ఇత్తడి దీపాలు, తంజావూరు పెయింటింగ్స్, ఆర్ట్ ప్లేట్లు, చెక్క, రాతి శిల్పాలు, టెర్రకోట, కేన్ ఫర్నిచర్, జ్యూట్, తాటి ఆకు ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు తదితర హస్తకళా ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ ఎస్.అమృత జ్యోతి, అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి.గోపికన్నన్ పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా దుర్గేష్ నందిని శిష్య బృందం కూచిపూడి నృత్యంతో అలరించారు.

## పి ఆర్ టీ యు (టీ ఎస్ ) రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గానికి అభినందనలు...

కొండ విజయ్ కుమార్....

**క్రైమ్ మిర్రర్ చందానగర్:** ఉపాధ్యాయ సంఘాలు బాధ్యతతో ముందుకు సాగి విద్యారంగాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా పి ఆర్ టీ యు (టీ ఎస్ ) నూతన కార్యవర్గాన్ని శనివారం చందానగర్‌లో ఆయన ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా సామాల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెదమారు రాఘవేందర్, అధ్యక్షుడిగా కృష్ణా రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సంఘాలు ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలని కొండ విజయ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి.హనుమంతు, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, శివరాజ్, శేఖర్, అమర్ గౌడ్, అర్చన, సుభాష్, శ్రీనివాస్ రెడ్డి, పాండురంగారెడ్డి, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఆకుతోటపల్లిలో అక్రమ మైనింగ్ అనుమతుల రద్దుకు భారీ ఆందోళన

- ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపించి లీజుకు ఇచ్చారంటూ గ్రామస్తుల ఆరోపణ
- ప్రజాభిప్రాయం, గ్రామ పంచాయతీ ఎన్‌ఓసీ లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నలు
- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రైతులు, మహిళలు, యువత భారీ ధర్నా





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 304లో మైనింగ్ కార్యకలాపాలకు ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థలకు పట్టా భూమిగా చూపించి లీజుకు ఇచ్చారని ఆరోపిస్తూ గ్రామస్తులు ఆమనగల్లు పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బైఠాయించి అక్రమ మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఆకుతోటపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 304లో ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా, 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ ప్రైవేట్ సంస్థలకు పట్టా భూమిగా చూపించి సుమారు 4.86 హెక్టార్ల భూమిని లీజుకు ఇచ్చినట్లు వారు ఆరోపించారు. అంతేకాకుండా ఈ భూమిలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు ఇచ్చే ముందు గ్రామ ప్రజల నుంచి ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని వారు పేర్కొన్నారు. అదేవిధంగా మైనింగ్ అనుమతులకు సంబంధించి గ్రామ పంచాయతీ నుంచి ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోకుండానే అనుమతులు మంజూరు చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రజల అభ్యంతరాలను, గ్రామ పంచాయతీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడం వల్ల గ్రామ పరిసరాలు, వ్యవసాయ భూములు, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామ పరిసర ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాల కారణంగా దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యం వంటి సమస్యలు ఏర్పడే పరిస్థితి ఉందని అన్నారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతినడంతో పాటు రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మైనింగ్ అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి విషయంలో రికార్డులను పరిశీలించి, భూమి వాస్తవ స్థితిగతులను తేల్చాలని, మైనింగ్ అనుమతులు ఏ నిబంధనల ప్రకారం మంజూరు చేశారో అధికారులు ప్రజలకు స్పష్టం చేయాలని గ్రామస్తులు కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ పంచాయతీ అనుమతి, సంబంధిత శాఖల నిబంధనలు పాటించకుండా అనుమతులు ఇచ్చి ఉంటే వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. “ఆకుతోటపల్లి గ్రామాన్ని పర్యావరణ కాలుష్యానికి గురిచేయొద్దు.. ప్రభుత్వ భూమిని కాపాడాలి.. అక్రమ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి” అంటూ ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ ధర్నాకు ఆకుతోటపల్లి గ్రామం నుంచి భారీ సంఖ్యలో రైతులు, గ్రామస్తులు, మహిళలు, యువత, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూత్ సభ్యులు తరలివచ్చారు. గ్రామ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, శ్రీపాతి పుల్లారెడ్డి, శ్రీపాతి శశిధర్‌రెడ్డి, సింగం శీనయ్య, నిట్ట నారాయణ, వి.వీరేష్‌గౌడ్, హాజీ పాషా, వట్టికోట కృష్ణ, రాంచంద్రయ్య, కొప్పుల శేఖర్, బాలరాజ్, ఉపసర్పంచ్ ఓర్సు శ్రీనుతో పాటు వార్డు సభ్యులు బాలు, సాజిద్, డీకే, విజయ్, కొమురమ్మ, స్వరూప, నర్సింహా, సాలమ్మ, శరత్ తదితరులు పాల్గొన్నారు.




# అల్ఫోర్స్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రాణాలకు ముప్పు**

**హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి: ట్రాఫిక్ సీఐ ఎం.డి. హన్నన్**




**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్):** పట్టణంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల ట్రాఫిక్ సీఐ ఎం.డి. హన్నన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సీఐ సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటిస్తూ నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలపై కుటుంబ సభ్యులు, స్నేహితుల్లోనూ అవగాహన కల్పించాలని కోరారు. యువత చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా తావివ్వకుండా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచితే ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కోరింతకుంట సెరికల్చర్ మోడల్‌కు తమిళనాడు మంత్రి ప్రశంసలు

ఆధునిక సాంకేతికతతో మల్బరీ సాగు.. రైతుల కృషికి అభినందన

సెరికల్చర్‌లో తెలంగాణకు రోల్ మోడల్‌గా ముడావత్ శక్రు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కోరింతకుంట గ్రామంలో రైతులు అవలంబిస్తున్న సెరికల్చర్ విధానాన్ని తమిళనాడు గ్రామీణ పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి పి. మాథన్ రాజా శనివారం పరిశీలించి ప్రశంసించారు. గ్రామంలోని సెరికల్చర్ రిసోర్స్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి అనంతరం పలు మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తలకొండపల్లి ప్రాంతంలో రైతులు అనుసరిస్తున్న సెరికల్చర్ మోడల్‌పై మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మల్బరీ సాగులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులను వినియోగిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పాదకత సాధించేందుకు రైతులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

**శక్రు సేవలకు మంత్రి అభినందన...**

కోరింతకుంటకు చెందిన ముడావత్ శక్రు సెరికల్చర్ రంగంలో చేస్తున్న సేవలను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. స్వయంగా సెరికల్చర్‌లో ఆదర్శంగా నిలవడంతో పాటు, తోటి రైతులను ప్రోత్సహిస్తూ తలకొండపల్లి మండలంలో సుమారు 120 మల్బరీ పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణానికి ప్రేరణగా నిలిచారని కొనియాడారు. రైతులకు పట్టు పురుగుల పెంపకంపై నిరంతరం సలహాలు, సూచనలు అందిస్తూ శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహిస్తున్న శక్రు సేవలను మంత్రి అభినందించారు.

**సెరికల్చర్‌లో శక్రు రోల్ మోడల్...**

కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ... శక్రు తెలంగాణలో సెరికల్చర్ వ్యవసాయానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నారని అన్నారు. మరింత మంది రైతులు సెరికల్చర్‌ను చేపట్టేలా చురుకుగా ప్రోత్సహిస్తూ, రైతులకు మార్గదర్శకత్వం అందిస్తున్నందుకు ఆయనను అభినందించారు. కోరింతకుంటలో జరిగిన ఈ కార్యక్రమంతో తలకొండపల్లి సెరికల్చర్ మోడల్‌కు మరింత గుర్తింపు లభించింది. రైతుల స్వీయ ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికత వినియోగం, పరస్పర సహకారం, శక్రు వంటి రైతు నాయకుల మార్గదర్శకత్వంతో సెరికల్చర్ రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కార్యక్రమంలో తమిళనాడు పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ (హెచ్‌క్యూ) శ్రీమతి ఎస్. పొన్మారి, రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఎఫ్‌ఏసి) ధర్మపురి తిరు వి. ఇళయరాజా, డిప్యూటీ డైరెక్టర్ (ప్రీ-కకూన్) డా. ఎ. అబ్దుల్ ఫారూక్, టీఎన్ సెరికల్చర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, హోసూర్ డిప్యూటీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ తిరు ఎ. పళనిస్వామి, తిరుచ్చి అసిస్టెంట్ డైరెక్టర్ తిరు ఎం. అరుళ్ సురేష్, దిండిగల్ అసిస్టెంట్ డైరెక్టర్ తిరు జాన్ పార్థిబన్, సేలం అసిస్టెంట్ డైరెక్టర్ తిరు శిలంబరసన్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ తిరు ముత్తుకుమార్, ఉప్పిలియాపురం టీఏస్సీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ తిరు వేలుస్వామి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ తిరు శ్రీధర్, ఏడప్పాడి టీఎస్సీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ తిరు పళనిస్వామి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ తిరు ఎన్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల తర్వాత గురువులే మార్గదర్శకులు



**గుండాల, సెప్టెంబర్ 20(క్రైమ్ మిర్రర్):** తల్లిదండ్రుల తర్వాత జీవితానికి దిశానిర్దేశం చేసేది గురువులేనని, గురువులను గౌరవించుకున్నప్పుడే సమాజంలో వ్యక్తులకు నిజమైన గౌరవం లభిస్తుందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, పోలీస్ అథారిటీ కంప్లైంట్స్ మెంబర్ ఒర్రె వెంకటేశ్వర్లు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య ప్రతి వ్యక్తి జీవితంలో చెరగని స్థిరాస్తి అని, చదువుకున్న కొద్దీ వ్యక్తి సామర్థ్యానికి అనుగుణంగా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. తాను కూడా గుండాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే విద్యనభ్యసించి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయి పదవులను చేపట్టానని వెంకటేశ్వర్లు గుర్తుచేశారు. సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా, పోలీస్ అథారిటీకి సంబంధించిన బాధ్యతల్లో పనిచేసిన సమయంలో ప్రధానంగా ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేశానని తెలిపారు.

**“మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి”**

ప్రస్తుత పరిస్థితుల్లో మద్యపానం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బానిసలవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

**“గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలి”**

గ్రామాల్లో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి పోలీసుల ఆధ్వర్యంలో ప్రతివారం సమావేశాలు నిర్వహించాలని వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామాల్లో వర్గపోరులకు తావులేకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదని, ప్రజల విలువలు, హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ప్రజలకు సేవలు అందించినప్పుడే పోలీసు అధికారులకు ప్రభుత్వపరంగానే కాకుండా ప్రజల మధ్య కూడా గౌరవం లభిస్తుందని అన్నారు. సమాజంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా ముందుగా పోలీసులకే సమాచారం అందించే పరిస్థితి ఉందని, ఆ నమ్మకాన్ని పోలీసులు కాపాడుకోవాలని సూచించారు.

**“అవినీతి నిర్మూలనకు చర్యలు అవసరం”**

అవినీతి నిర్మూలనలో ఏసీబీ దాడుల వల్ల కొంతమేర అవినీతి తగ్గిందని అన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి అధికారి పనిచేయాలని సూచించారు. ప్రజాసేవలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, జర్నలిస్టులను మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ, రిటైర్డ్ ఎంఈఓ గార్లపాడు సోమిరెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం అందెం సంజీవరెడ్డి, గుండాల సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య, గుండాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా, ఎండీ షర్ఫుద్దీన్, ప్రజాగాయకుడు, రచయిత కోదారి శ్రీను, గుండాల ఉపసర్పంచ్ ఆవుల సాయి ప్రసాద్, రామారం సర్పంచ్ మచ్చ నాగిరెడ్డి, మానవ హక్కుల సంఘం సభ్యులు నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, కునగల మల్లేష్, ఆవుల శ్రీనివాస్, గుండాల ఎస్‌హెచ్ఓ వి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

# 202 వారాలుగా నిర్విరామంగా సాగుతున్న హోప్ ఫౌండేషన్ అన్నదానం.



**క్రైమ్ మిర్రర్ చందానగర్:** హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గత 202 వారాలుగా అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుండటం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. రోజూ ఆకలితో అలమటించే వందలాది మంది నిరుపేదలు, వృద్ధులు, వలస కూలీలకు కడుపునిండా అన్నం పెడుతూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా అందరికీ అన్నం పెట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ఈ సందర్భంగా కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ “సేవే మా లక్ష్యం, ఆకలి అన్న మాట లేకుండా చేయడమే హోప్ ఫౌండేషన్ ఆశయం. గత 202 వారాలు పూర్తి చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది, దీనికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి సింగరేణి సెక్యూరిటీ గార్డ్ కి డాక్టరేట్



**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 19 క్రైమ్ మిర్రర్:** జానపద కళా రంగంలో ఫోక్ డాన్సర్ గా అనేక విజయాలు సాధించినందుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ జర్మన్ వారి చేతుల మీదుగా మందమర్రి ఎస్ అండ్ పిసి డిపార్ట్మెంట్లో సీనియర్ సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్న కే ఆర్.సంపత్ ఫోక్ డ్యాన్స్ లో డాక్టరేట్ అందుకున్నారని తెలిపారు. జానపద కళా రంగంలో అనేక ఫోక్ డ్యాన్స్ లో విజయాలు సాధించినందుకు తమిళనాడు పాండిచ్చేరిలో ఈ యొక్క అవార్డును అందుకున్నారని అన్నారు. ఇటీవలే కోల్ ఇండియాలో ఫోక్ డాన్సుల్లో కూడ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు.

## సబ్సిడీపై వాహనల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 22న ధ్రువపత్రాల పరిశీలన

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్, బడంగ్పేట్ సర్కిల్ బడంగ్పేట్ మరియు మీర్పేట్ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ కింద ద్విచక్ర మరియు త్రిచక్ర వాహనాల మరియు మైనారిటీ కార్పొరేషన్ పథకాల కింద ద్విచక్ర వాహనాల మంజూరుకు సంబంధించి ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారుల ధృవపత్రాల పరిశీలన కార్యక్రమం ఈనెల 22న మంగళవారం నాడు ఉదయం 11.00 గంటలకు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించబడనున్నది. కావున, సంబంధిత లబ్దిదారులు తమ ఒరిజినల్ అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్బుక్, డ్రైవింగ్ లైసెన్స్ (వర్తించినచో) మరియు ఇతర సంబంధిత ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను తీసుకొని నిర్ణీత సమయానికి హాజరై ధృవపత్రాల పరిశీలన కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా బడంగ్పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఒక ప్రకటనలో కోరడమైనది.